క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట సినిమా హాలు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఆదివారం ప్రారంభించారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగను ప్రజాప్రతినిధులు, నాయకులు బాటసారులకు, వాహనదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులి వీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నూకాలమ్మ తీర్థం


నూకాలమ్మ వారు

పెదపూడి: మండలంలోని కాండ్రేగుల గ్రామంలో నూకాలమ్మ తీర్థం సోమవారం వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి నూకలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శక్తి వేషాలు, గరగ నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం జరిగే తీర్థానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వి.శివబాబు, ప్రత్యేకాధికారి మోర్త మురళీ వీరభద్రరావు చెప్పారు. అమ్మవారికి దర్శనానికి భారీగా తరలివచ్చే భక్తుల కోసం నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశామన్నారు. జి.మామిడాడ, కరప, కూరాడ, పెదపూడి రోడ్ల కూడలిలో వచ్చే భక్తులకు రవాణా ఇబ్బందులు లేకుండా ఎస్‌ఐ శోభన్‌కుమార్ ట్రాఫిక్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

ఘనంగా దివ్య కారుణ్య పండగ


మాట్లాడుతున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: కోరుకొండ సీతారామ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం దివ్య కారుణ్య పండగను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ మాణిక్యం మాట్లాడుతూ గత ఆదివారం పునరుత్థానుడైన ఏసుక్రీస్తు దివ్యకారుణ్య మూర్తిలా శిష్యులకు దర్శనమిచ్చారన్నారు. ఆయనపై విశ్వాసాన్ని ఉంచాలన్నారు. శ్రమలను అనుభవించి, శిలువపై మరణించి పునరుత్థానుడైన క్రీస్తు.. మానవాళి విముక్తి కోసమై మరణించారన్నారు. కార్యక్రమంలో ఉపదేసి బెల్లపు డేవిడ్, సంఘపెద్దలు బూసి వసంత్, థామస్, విక్టర్, వరమ్మ, అనంతరావు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్


ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు చిత్రపటం అందజేస్తున్న ముస్లింలు

సీతానగరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని, ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఇనుగంటివారిపేట మదీనా మసీదులో ఆదివారం ముస్లిం పెద్దలు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజాకు మక్కా మసీదు చిత్రపటాన్ని ముస్లిం పెద్దలు అందించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆరీఫ్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, సర్పంచ్ సత్యం రాంపండు, చల్లమళ్ల సుజీరాజు, మల్లిన చౌదరి, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.

ఘనంగా వేగుళ్లమ్మ సంబరం


అమ్మవారి గరగలకు హారతి ఇస్తున్న సత్యనారాయణ దంపతులు

సీతానగరం: మిర్తిపాడులో వేగుళ్లమ్మ అమ్మవారి సంబరం ఆదివారం ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం, వివిధ దేవతామూర్తుల వేషధారణలు, బాణసంచా కాల్పులతో అమ్మవారి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల వ్యవసాయశాఖ సలహాదారుడు జొన్నలగడ్డ సత్యనారాయణ నివాసం వద్ద అమ్మవారికి పాన్పు వేశారు. సత్యనారాయణ, ఉమారాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో రాత్రి పది గంటల వరకూ గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.


పందలపాకలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్


భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- నాలుగు వేల బైక్‌లతో వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

బిక్కవోలు: గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి చూసి ఓటేయాలని అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో ఆదివారం ఆయన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి సుమారు నాలుగు వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ స్థాయిలో తరలి వచ్చి ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేశారు. అనంతరం కొంకుదురు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, ఊలపల్లి, బిక్కవోలు, ఆర్‌ఎస్‌పేట, బలభద్రపురం గ్రామాల్లో ర్యాలీ సాగింది. ప్రతి గ్రామంలోనూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు ప్రజలు పూలజల్లులతో, హారతులతో ఘన స్వాగతం పలికారు. పందలపాకలో కల్లు గీత కార్మికులు ప్రగాడ కోటేశ్వరరావు కల్లు గీత బల్లను ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మెడలో వేశారు.

సీఎం జగన్‌తోనే భావితరాలకు బంగారు భవిష్యత్

రాష్ట్రంలో భావితరాలకు బంగారు భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడురి శ్రీనివాస్‌లు అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రతిఒక్కరూ జగనన్న సుపరిపాలనను దృష్టిలో ఉంచుకుని ఫ్యాను గుర్తుకు ఓటేయాలన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనానికి ఎన్‌డీఏ కూటమి కుప్పకూలడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, బలభద్రపురం సర్పంచ్ బుంగా రామారావు, ఊలపల్లి సర్పంచ్ బండారు రమ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచారం కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల జేఎస్‌సీ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, తొస్సిపూడి వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ యామన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు బంగారు మంగళ సూత్రం సమర్పణ


అమ్మవారికి బంగారు సూత్రం, వెండి కిరీటం సమర్పించిన దాతలు

రాజానగరం: గ్రామ దేవత నూకాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన ముచ్చకర్ల మూలయ్య, జగ్గాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం అమ్మవారికి బంగారు మంగళ సూత్రం, చిన్న విగ్రహానికి వెండి కిరీటాలను ఆదివారం బహూకరించారు. వీటి విలువ సుమారు రూ.3.70 లక్షలని దాతలు తెలిపారు.

వైభవంగా జాతర

నూకాలమ్మ జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, శక్తి వేషాలు, విచిత్ర వేషధారణతో జాతరను ఘనంగా జరిగింది. జాతరలో భాగంగా ఉదయం గ్రామంలో తాటిచెట్టును ఊరేగించారు. ఆ తాటిచెట్టుపై గ్రామస్తులందరూ పసుపు నీళ్లను పోస్తూ, చల్లగా చూడాలని కోరుకున్నారు. సోమవారం తీర్థం నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సింగంపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సింగంపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పంచాయతీ వార్డు మెంబరు కాకరపల్లి మహాలక్ష్మి, శీరం వెంకటేశ్వరరావు, బోడెం హరి తదితరులతో పాటు మరో 30 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా చంద్రబాబు ప్రవేశపెట్టగలిగారా అంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు అండ్ కో ఏవేవో హామీలు ఇస్తున్నారని, వారికి అధికారమిస్తే కుంటిసాకులు చెప్పి హామీలు అమలు చేయకుండా పబ్బం గడుపుతారన్నారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు.

చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదు

- జగన్ పాలనకు అందరి మద్దతు
- కూనవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


కూనవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: చంద్రబాబు అండ్ కోపై ప్రజలకు నమ్మకం పోయిందని, వైఎస్సార్ సీపీలోకి పెరుగుతున్న చేరికలే దానికి నిదర్శనమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన శనివారం రాత్రి కూనవరంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పీతల ప్రసాద్, జాన్ ఏసు, ప్రత్తిపాటి వీరమ్మ, మంగ, ప్రత్తిపాటి బోసులతో పాటుగా 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరి జీవితాల్లో అభివృద్ధి వెలుగులు విరబూసాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలని కోరారు. అమలు కాని హామీలు ఇచ్చి, కూటములు కట్టి, కులాల మధ్య చిచ్చుపెడుతున్న ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కూనవరంలో మౌలిక వసతులు కల్పించి, గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఉప సర్పంచ్ మండపాక గణేష్, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, అయిల మధు, నల్లమోలు పాపారావు, నల్లమోలు నూకరాజు, అయిల పాపారావు, మేండ్రు పిచ్చయ్య, అడప బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

మధురపూడి: కోరుకొండ మండలంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మండలంలోని బూరుగుపూడి శివాలయం పరిసర ప్రాంతంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు, పార్టీ నాయకుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. అనంతరం తేజ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియోజవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారన్నారు. 22 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిట్టా కృష్ణ, పార్టీ నాయకులు చొంగా వెంకన్న, ఏడిద ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎమ్మెల్యే రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- సీతానగరం వెలమపేటలో ఎన్నికల ప్రచారం


సీతానగరం వెలమపేటలో మహిళకు నమస్కరిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పిలుపునిచ్చారు. సీతానగరం వెలమపేటలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి తన భర్త జక్కంపూడి రాజాను ఎమ్మెల్యేగా, అలాగే ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. 2014 నుంచి 2019 వరకు ప్రజల పక్షాన ఉంటూ తన భర్త జక్కంపూడి రాజా, అత్త విజయలక్ష్మి, మరిది గణేష్ ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కాతేరు నుంచి సీతానగరం వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ చేపట్టారని, సీతానగరంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారని, బొబ్బిల్లంక వద్ద ఎత్తిపోతల పథకానికి నిధులు తీసుకువచ్చారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని, గుంపుగా వస్తున్న ప్రతిపక్ష పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, మద్దాల కొండలరావు, చిరికి వెంకటరమణ, కోండ్రపు శ్రీను, చింతలపూడి వీరబాబు, ఫైల మురళీ, మట్ట శ్రీను, బీరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ ప్రచారం

సీతానగరం: సీపీఐ ఎంఎల్ ఎమ్మెల్యే అభ్యర్థి పలివెల వీరబాబు ఆదివారం చీపురుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వృద్ధులు, వితంతువులకు రూ.5 వేలు పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

820 లీటర్ల సారా స్వాధీనం

సీతానగరం: వెదుళ్లపల్లి శివారు లంకభూమిలో సారా తయారీ బట్టీపై ఆదివారం ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 4 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 820 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారైన సారా బట్టీ నిర్వాహకుడు దాసరి పోసియ్యపై కేసు నమోదుచేశారు.

జగన్ పాలనలోనే పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే రాజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్
- జోరుగా ఎన్నికల ప్రచారం


సామాజిక వర్గాలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: జగన్ పాలనలోనే పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అవి జరగాలంటే వైఎస్సార్ సీపీకే మరోసారి అధికారం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నందరాడ, నరేంద్రపురం, రాజానగరం ఆదివారం పలువురు ప్రముఖులను, పెద్దలను కలుసుకున్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మరొసారి విజయకేతనం ఎగురవేసేందుకు సహకరించాలని కోరారు. ఆర్యవైశ్య, శెట్టిబలిజ, గౌడ, సగర, యాదవ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలతో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం ఆయా గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వపరంగాను, ఎమ్మెల్యే పరంగాను చేసిన ప్రగతిని, అందించిన సంక్షేమ ఫలాలను గుర్తు చేస్తూ, ఇదే ఒరవడి మరికొంతకాలం కొనసాగితే పేదలంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి, రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి అవకాశం ఉంటుందన్నారు. అధికారం కోసం తహతహలాడుతున్న ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

రంగంపేట: అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసినట్టు తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో ఉన్న రామేశ్వరంపేట సత్రానికి చెందిన భూమిలో శనివారం అర్ధరాత్రి నల్లమిల్లి గ్రామానికి చెందిన కొండేపూడి బాలయ్య అనే వ్యక్తి ఎటువంటి పర్మిషన్ లేకుండా నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో అక్రమంగా మట్టి తరలిస్తుండగా పోలీసుల సాయంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- కైకవోలులో ఎన్నికల ప్రచారం


కైకవోలులో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని కై కవోలు గ్రామంలో ఆదివారం ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు ప్రతి గడపలో మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ కుల, మత, పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శవంతంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేరుస్తున్నారన్నారు. అందుకే ఎన్నికల ప్రచారంలో ఏ గడపకు వెళ్లినా అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజల గుండెల్లో జగన్ కొలువై ఉన్నాడని, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి, ఉప సర్పంచ్ కొప్పిశెట్టి వీరశంకర్, ఎంపీటీసీ సభ్యుడు టి.నాగరాజు, గ్రామ కన్వీనర్ ఎల్లే సత్తిబాబు, పి.కల్యాణి, మేడపాటి విజయ, నూని రామచంద్రరావు, దాట్ల శివాజీ రాజు, మేడిశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్


జి.మామిడాడ వైఎస్సార్ సీపీ నాయకులతో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

పెదపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. ఆదివారం జి.మామిడాడ విచ్చేసిన ఆయనకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనాలు, స్వామివారి చిత్రపటం బహూకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రధానంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై ఇతర రాష్ట్రాలు సైతం ప్రశంసలు కురిపిస్తున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని చెప్పారు. ప్రజలంతా గత ఐదేళ్లుగా జరిగిన మంచిని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా జగన్, ఎంపీగా తాను విజయం సాధించాలని సూర్యనారాయణమూర్తిని కోరుకున్నానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, కాకినాడ రూరల్ మాజీ ఎంపీపీ గుబ్బల వెంకటేశ్వరరావు, కడిమి శ్రీను, నల్లమిల్లి భూలోకరెడ్డి, రాయుడు రాఘవ, పప్పు చిన్నారెడ్డి, డీవీ రాఘవరెడ్డి, కాకినాడ నాయుడు, నాగులపల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకుడు

పోసికుమార్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పోసిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దివ్యాంగులకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసిబాబు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సామాజిక సేవలకు గాను పోసిబాబు ఇటీవల న్యూఢిల్లీకి చెందిన హోప్ టీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న పోసిబాబును ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి ఆదిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.